క్లుప్తంగా

250 మందికి వైద్యసేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్

సీతానగరం: శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో సాధారణ, కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సత్యం రమేష్ బాబు, టీవీ సుబ్బారావు 250 మందికి వైద్యసేవలు అందించారు. తొమ్మిది మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, ఉచిత ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో గద్దె శ్రీరామచంద్రరావు, శ్రీనివాసరావు, లక్ష్మి పాల్గొన్నారు.

యోగా గురువుకు సత్కారం



యోగా గురువును సత్కరిస్తున్న శిష్యులు

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలోని మహిళ యోగా గురువు కర్రి రాణిని ఘనంగా సత్కరించారు. సోమవారం గురుపూజోత్సవం సందర్భంగా యోగా సెంటర్‌లో ఆమెను తన శిష్య బృందం ఘన సత్కరించింది. ఈ కార్యక్రమంలోని గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల వితరణ



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న వినయ్ తేజ

మధురపూడి: కోరుకొండ మండలం గుమ్ములూరులో శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్ తేజ సోమవారం రూ.50 వేలు వితరణ చేశారు. ఆలయ కమిటీ నాయకుల కోరిక మేరకు ఈ నగదును అందజేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, బూరుగుపూడి పీఏసీ చైర్ పర్సన్ బుడ్డిగ సత్తిబాబు, గుమ్ములూరు మాజీ సర్పంచ్ మట్టా పెద్ద వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ న్యాయం



నల్లమిల్లిలో మహిళకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న వైస్ ఎంపీపీ శ్రీను

రంగంపేట: అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైస్ ఎంపీపీ మట్టా శ్రీను అన్నారు. నల్లమిల్లి గ్రామంలో సచివాలయం వద్ద సర్పంచ్ నల్లా పద్మ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.దొరకయ్య, పంచాయతీ కార్యదర్శి ఎల్.త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు నల్ల దుర్గాప్రసాద్, కొండేపూడి చిన్న, ప్రగడ గౌరీ శంకర్, మాగాపు దొరబాబు, ఉప సర్పంచ్ పంచమర్తి సాయిబాబా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన కాత్యాయనీదేవి



శాకంబరి అలంకరణలో అమ్మవారు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో ఉన్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో సోమవారం ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా కాత్యాయనీదేవి అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు, భక్తులు అందించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మఒడి.. ఆనందాల సడి

- తల్లుల ఖాతాలో నగదు జమ
- అనపర్తి మండలంలో 4,952 మందికి లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



అమ్మఒడి పథకం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పేద విద్యార్థులకు అమ్మఒడి పథకంగా వరంగా మారింది. ఆర్థికంగా ఇబ్బంది పడుతూ చదువుకు దూరమవుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఈ పథకం ద్వారా బంగారు బాట వేసింది. 2019–20 విద్యా సంవత్సరం నుంచి క్రమం తప్పకుండా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఏటా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.15 వేల ఆర్థిక సాయం జమవుతోంది. విద్యార్థుల తల్లిదండ్రులకు వారి పిల్లల చదువులు భారం కాకుండా పూర్తి బాధ్యతలు ప్రభుత్వమే భరించేలా వివిధ పథకాలను ప్రవేశపెడుతూ విద్యార్థుల భవితకు పునాదులు వేస్తోంది. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుస్తూ కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా సర్కారు బడులను తీర్చిదిద్దుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులూ ఉండాలన్న ఉద్దేశంతో విద్యాకానుక అందించింది. విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న విప్లవాత్మక సంస్కరణలు, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ఫలితంగా బడి బయట పిల్లలను సైతం ప్రభుత్వ బడి బాట పడుతున్నారు. ఈ ఏడాది అమ్మఒడి నాలుగో విడతగా మండలంలోని 11 గ్రామ పంచాయతీల పరిధిలోని వివిధ పాఠశాలల్లో 4,952 మంది లబ్ధిదారులు రూ.7,42,80,000 ఆర్థిక ప్రోత్సాహకంగా అందుకోనున్నారు.

విద్యార్థుల తల్లులకు అండగా...

స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో సోమవారం అమ్మఒడి వారోత్సవాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం శాపం కాకూడదన్న ఉద్దేశంతో దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోను లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకానికి అమలు చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా నాలుగో విడతగా ప్రభుత్వం అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదును జమ చేస్తున్నట్టు చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, సర్పంచి వారా కుమారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంఈఓ కె.స్వామినాయక్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా వచ్చే సొమ్మును తల్లులు వారి పిల్లల చదువులకే వినియోగించి పిల్లలను ప్రయోజకులను చేయాలని ఆకాంక్షించారు. అనంతరం అమ్మఒడి పథకం కింద మండల పరిధిలో 5,120 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.7,68,000 చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.

ఇప్పుడు ఆ బెంగ లేదు



నాకు ఇద్దరు సంతానం. మా పెద్ద పాప అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతోంది. గత ఏడాది అమ్మఒడి పథకంలో వచ్చిన సొమ్ముతో మా పిల్లలకు కావాల్సిన వస్తువులన్నీ కొనుగోలు చేశా. ప్రతి సంవత్సరం పుస్తకాలు తదితర వస్తువులన్నీ కొనుగోలు చేసేందుకు ఎంతో ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు ఆ బెంగలేదు. అమ్మ ఒడితో ఆర్థిక ఇబ్బంది తీరింది. ప్రతి పిల్లవాడు బడిబాట పట్టేందుకు సీఎం వైఎస్ జగనన్న ప్రవేశపెట్టి క్రమం తప్పకుండా అమలు చేస్తున్న అమ్మఒడి పథకం పేదలందరికీ అండగా నిలుస్తోంది.

–టి.స్వాతి, విద్యార్థి తల్లి, దుప్పలపూడి, అనపర్తి మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



మా పాప భాగ్యశ్రీ ఐదోతరగతి చదువుతోంది. నా కుమార్తెకు అమ్మఒడి పథకం వర్తించడంతో నా బ్యాంక్ ఖాతాలో రూ.15 వేలు జమయ్యాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి పథకం పేద విద్యార్థులకు ఓ వరం. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాటల వేసే బాధ్యతను తన భుజాలకెత్తుకున్న ముఖ్యమంత్రి జగనన్నకు అమ్మలందరూ రుణపడి ఉంటాం.

– ఎం.బేబీరత్నం, అనపర్తి

జగన్ పాలనలో దళితులకు పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం దళితులకు పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన దళిత నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. దళితులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎటువంటి మేలు జరగడం లేదన్న టీడీపీ నేతల ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. గోకవరంలో దళితుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. దళితుల శ్మశానవాటికలో సీసీ రోడ్డు నిర్మించారని, ప్రస్తుతం దీనిచుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. టీడీపీ నేతల ప్రోద్బలంతోనే గోకవరంలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు కాకుండా నిలిచిపోయాయని ఆరోపించారు. జగ్గంపేటలో ఎకరం స్థలంలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శంకుస్థాపన చేశారని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, బిజ్జి రాజు, మచ్చా మోహన్, బొడ్డపాటి వీరచంద్రం, బూలా అబ్బులు, కొల్లపు అర్జున్‌రావు, మందపాటి సతీష్, అంబటి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



రామేశ్వరంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రామేశ్వరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెదపూడి: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. రామేశ్వరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో అన్ని పథకాలు టీడీపీ నాయకులే పొందారని, పేదలకు పథకాలు అందని ద్రాక్ష మిగిలాయన్నారు. అయితే జగన్ సీఎం అయ్యాక తమ ఇంటి ముంగిటకు సంక్షేమ పథకాలు అందుతున్నాయంటూ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పేదల అభ్యున్నతికే సీఎం జగన్ నవరత్న పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి కొటికలపూడి చినబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బసవ విజయకుమారి, గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, స్థానిక పార్టీ నేతలు కొటికలపూడి గణేష్, కొటికలపూడి గోపి, తిరుమలశెట్టి వెంకటరమణ, ఉప సర్పంచి కొటికలపూడి వరలక్ష్మి, దుళ్ల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మోదకొండమ్మ జాతర

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామదేవత మాతృశ్రీ మోదకొండమ్మ జాతర మంగళవారం నుంచి ఈనెల 11వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీరంగపట్నానికి చెందిన కళాకారుల బృందాలే వీటిని నిర్వహిస్తాయి. ఉత్సవాలు ప్రారంభం రోజైన మంగళవారం గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు.

అన్నసమారాధన

బిక్కవోలు: స్థానిక జి.మామిడాడ రోడ్డు ఉన్న కొండదం రామాలయం వద్ద షిర్డి సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమానికి ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి ప్రారంభించారు. సుమారు దు వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

బిక్కవోలు ఎంఈవోగా సత్యనారాయణ



బిక్కవోలు: మండల విద్యాశాఖ అధికారిగా సీహెచ్ వీవీ సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈవోగా రంగంపేట ఎంఈవో కె. శ్రీనివాసరావు విధులు నిర్వహించారు. నూతన ఎంఈఓ సత్యనారాయణకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బిక్కవోలు: బలభద్రపురం శివారుల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అనపర్తి చెందిన సత్తి పాండురంగారెడ్డి(48) బైక్ పై బిక్కవోలు వెళ్లి తిరిగి ఇంటి వస్తుండగా బలభద్రపురం శివారు చేపల కేంద్ర వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని కాకినాడ తీసుకువెళ్లడంతో మార్గం మధ్యలో మృతి చెందినట్టు తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

గణితంపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజశేఖర్

రాజానగరం: అన్ని శాస్త్రాలకు మూలమైన గణితంపై పట్టు సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఖరగ్‌పూర్) ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్టుమెంట్ ఆఫ్ మ్యాథ్‌మెటిక్స్ ఆధ్వర్యంలో సోమవారం గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మ్యాథ్‌మేటికల్ మోడలింగ్ ఇన్ రియల్ లైఫ్ ప్రోబ్లమ్స్ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులను చైతన్యపరిచారు. వైద్య శాస్త్రంలోని వివిధ సమస్యలను గణిత శాస్త్ర నిపుణతతో ఏవిధంగా పరిష్కరించవచ్చునో ఉదాహరణలతో వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయ నిర్మల, ఆచార్య ఆర్.డేవిడ్ కుమార్, హెచ్ఓడీ డాక్టర్ కె.రేవతి పాల్గొన్నారు.

జోరుగా రెడ్‌క్రాస్ సభ్యత్వాలు



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్‌కు సభ్యత్వం అందిస్తున్న దృశ్యం

సీతానగరం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వాలు జోరుగా జరుగుతున్నాయని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ప్రకాష్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల చైర్మన్ పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్ బాబు) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 30 మంది సభ్యత్వాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.రాజు, రెడ్‌క్రాస్ సభ్యులు డాక్టర్ సత్యం రమేష్ బాబు, కంకటాల రమేష్, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ నాయకులు వలవల వెంకట్రాజు, దాకే రఘు, వలవల వల్లి, ద్వారంపూడి రామకృష్ణ, గుల్లి దామోదరం, కంకటాల ప్రసాద్ పాల్గొన్నారు.

స్థలం కబ్జా కేసులో ముగ్గురి అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు, చిత్రంలో సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్సై సుధాకర్

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని స్థానిక జీపీఆర్ లేఅవుట్‌లో కబ్జాకు గురై, చేతులు మారిన ఒక ప్లాట్‌కు సంబంధించిన కేసులో రాజమహేంద్రవరానికి చెందిన తానేపల్లి వెంకట రామకృష్ణ, నెట్ల కల్యాణ్ కుమార్, రౌతు రమేష్ నాయుడును పోలీసులు అరెస్టు చేశారు. నార్త్‌జోన్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం పందువకు చెందిన వేగేశ్న వెంకటరంగ అచ్యుత సత్యనారాయణరాజు స్థానిక జీపీఆర్ లేఅవుట్‌లో సర్వే నంబర్ 471/1లో 402 గజాల స్థలాన్ని కొన్నేళ్ల క్రితం కొనుగోలు చేసి ఖాళీగా వదిలేశాడు. ఇటీవల తమ గ్రామంలోని సచివాలయంలో ఈసీ చూస్తే ఆ స్థలం వేరొకరి పేరు మీద ఉన్నట్టు తెలిసింది. దీంతో వెంటనే రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు దిమ్మతిరిగే విషయాలు తెలిశాయి. స్థలం అసలు యజమాని అయిన సత్యనారాయణరాజు చనిపోయినట్టుగా డెత్ సర్టిఫికెట్ సృష్టించిన నేరగాళ్లు, స్థలానికి కూడా తప్పుడు పత్రాలు తయారు చేశారు. రూ.60 లక్షలు విలువ చేసే ఆ స్థలాన్ని రూ. 40 లక్షలకే వేరొకరికి అమ్మేశారు. నిందితులందరూ రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించినవారే. సమావేశంలో సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్సై సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీ రంగారావు జయంతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సామర్ల వెంకట రంగారావు (ఎస్వీ రంగారావు) నటన తెలుగు వారి గుండెల్లో ఎప్పటికీ సజీవమేనని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఎస్వీఆర్ జయంతిని సోమవారం ఉదయం గోదావరి గట్టున గల ఆయన విగ్రహం వద్ద ఎస్వీఆర్ కల్చరల్ అసోసియేషన్, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్, నగర చిరంజీవి యువత సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్‌రామ్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర తెలికుల గాండ్ల కార్పొరేషన్ చైర్మన్ సంకిన భవానీప్రియ, జనసేన జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, టీడీపీ నాయకుడు యర్రా వేణుగోపాలరాయుడు, బీజేపీ అర్బన్ కోఆర్డినేటర్ యెనుముల రంగబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో 300 చిత్రాలకు పైగా ఎస్వీఆర్ నటించారన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యాపురం బ్యాంకు మాజీ చైర్మన్ చల్లా శంకరావు, పోలు విజయలక్ష్మి, వాకచర్ల కృష్ణ, బొంతా శ్రీహరి, అడబాల రామకృష్ణ, కొత్తపేట రాజా, మజ్జి అప్పారావు, నల్లం శ్రీనివాస్, మార్గాని సురేష్, ఎస్‌వీ శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్ పాల్గొన్నారు. గోదావరిగట్టున ఉన్న ఎస్వీఆర్ విగ్రహానికి డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



అనపర్తి ఐఎల్‌టీడీ వద్ద ఆలయంలో బాబాకు పండ్ల రసాలతో అభిషేకిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి దంపతులు



బలభద్రపురంలో బాబా వారి పాలభిషేకం చేస్తున్నా వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి

అనపర్తి: స్థానిక ఐఎల్‌టీడీ రోడ్ బాబానగర్‌లో ఉన్న షిర్డి సాయి మందిరంలో గురుపూర్ణిమ నవమ వార్షికోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించారు. వేదపండితులు రెడ్డి సురేష్ శర్మ పర్యవేక్షణలో గ్రామానికి చెందిన పడాల రాజుగురుస్వామి, పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాబాను పుష్కర నదీజలాలతో అభిషేకించి, పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.శేషగిరిరావుపేట, రామవరం, పాతపూరులలో బాబాకు విశేష పూజలు జరిపారు. సాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.జానకిరామారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కొవ్వూరి సత్యశ్రీనివాసరెడ్డి(రఘు శ్రీను), మహాలక్ష్మి దంపతులను సత్కరించారు.

రంగంపేట: గ్రామాల్లో గురు పౌర్ణమి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎరిడీ సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పెదపూడి: మండలంలో జి.మామిడాడ, పెదపూడి, కరకుదురు. రామేశ్వరం, కాండ్రేగుల,పెద్దాడ, సంపర తదితర గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గోకవరం: రమాసత్యనారాయణస్వామి ఆలయంలో వ్యాసుడికి పూజలు నిర్వహించారు. ఆలయ సేవకులు వరసాల ప్రసాద్, ఉంగరాల ఆదివిష్ణు, తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప తదితరులు అర్చకుడు వల్లూరి జగన్నాథశర్మను సత్కరించారు. గీతామంది రంలో సనాతన ధర్మ ప్రబోధనా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాయిబాబు ఆధ్వర్యంలో వ్యాసమహర్షికి పూజలు నిర్వహించారు.

వైభవంగా గురుపూర్ణిమ

రాజానగరం: షిరిడీ సాయిబాబా మందిరంలో వేకువజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం వినాయకుడు, దత్తాత్రేయుడు, సరస్వతి మాత, సాయిబాబా విగ్రహాలకు డివిజనల్ గణాంకాధికారి వీరబాబు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్థానిక సాయి భక్త మండలి ఆధ్వర్యంలో గురు చరిత్ర పారాయణ చేశారు.

మధురపూడి: కోరుకొండ మండలంలోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బూరుగుపూడి బాబా ఆలయంలోని ఆలయ గురువు మామిడిపల్లి రామారావుకు ఆలయ కమిటీ చైర్మన్ కంటే నాగేశ్వరావు ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. కోరుకొండ పెట్రోలు బంకు ఎదురుగాగల ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ తాడి ఆదిరెడ్డి, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో బాబాకు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. మధురపూడి సుందర స్వామి ఆశ్రయంలో స్వామీజీని సత్కరించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల కోకన్వీనర్ గణేశుల పోసియ్య, నాయకులు, బీజేపీ రాష్ట్ర నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి పాల్గొన్నారు.

సీతానగరం: రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామనగరంలోని షిర్డీ రామసాయి ఆలయ వ్యవస్థాపకుడు వడ్లమూరు రామరాజు (రాము) ఆధ్వర్యంలో గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకుడు ఆరాధ్యుల రమేష్ నిర్వహించారు. రఘుదేవపురంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో మస్యం గోపి, ప్రసన్న దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.

ఆంధ్రా షిర్డీసాయి మందిరంలో..

బిక్కవోలు: బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డీ సాయిబాబా మందిరంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి బంగారు కిరీటాన్ని అలంకరించారు. గ్రామ పుర వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బిక్కవోలు, ఊలపల్లి, పందలపాక, తొస్సిపూడి, కొమరిపాలెం, కొంకుదురు తదితర గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పిల్లలకు ఇచ్చే నిజమైన ఆస్తి చదువే

రాజమహేంద్రవరం సిటీ: తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే నిజమైన ఆస్తి చదువేనని సీపీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత చింతా నాగగౌరీ శంకర ప్రసాద్‌రెడ్డి అన్నారు. జేఈఈ మెయిన్స్‌లో అఖిల భారత స్థాయిలో 38వ ర్యాంకు సాధించి. ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో సీటు సాధించిన వెలగల ధీరజ్ సాత్విక్ రెడ్డిని స్థానిక సీపీ రెడ్డి హీరో షోరూంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ తరఫున సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ సాత్విక్ రెడ్డి ఇంటర్మీడియట్‌లోనూ 97.5 శాతం మార్కులు సాధించాడన్నారు. కార్యక్రమంలో బి.ధర్మారెడ్డి, మురళీకృష్ణ, స్వర్ణాంధ్ర సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు, సంజీవ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.